క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యాడికి: మండలంలోని వేములపాడు, ఎస్.తిమ్మాపురంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిదులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పామిడి: మండల కేంద్రంలోని 4వ వార్డు సంబంధించి అంబేడ్కర్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించన్నున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

ఘనంగా పుష్యార్క హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పుష్యార్క హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేదపండితులు, అర్చకులు మంత్రోచ్ఛారణల మధ్య హోమాన్ని ముగించారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లోని ఆలూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. వీరి నుంచి రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం రాబడిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన మధుబాబు, పి.రఘు, అంజనీ కుళ్లాయి స్వామి, మస్తాన్‌వలి, కె.శ్రీనివాసులు,లోకేష్, హరికృష్ణ, ఎస్.శ్రీనివాసులును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈసందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

రజక వృత్తిదారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్: సీపీఎం అనుబంధ రజక వృత్తిదారుల సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం పట్టణాధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా సి.గంగరాజు, ఉపాధ్యక్షుడిగా నటరాజు, సహాయ కార్యదర్శిగా రవి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

గోదాదేవికి ఘనంగా హారతి



దివ్యమంగళ హారతి ఇస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్: పవిత్ర ధనుర్మాసంలో గోదాదేవికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో అత్యంత ప్రశస్తమైన గోదాహారతులను మహిళలు వివిధ ఆకృతులల్లో అలంకరించి శ్రీవారు,గోదాదేవికి దివ్య మంగళహారతులను సమర్పించారు. ఆదివారం ఆలయంలో గోదాదేవి మహా మంగళహారతి తదితర పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. అనంతరం గోదాదేవి మాదిరి వస్త్రాలంకరణ, హారతులను వివిధ ఆకృతుల్లో అలంకరించిన మహిళలకు ఆలయ కమిటీ వారు బహుమతులను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణ స్వామి, ప్రసాదకమిటీ చైర్మన్ వెంకట్, సుదర్శనబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

యల్లనూరు: మండలవ్యాప్తంగా సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కోడి పందేల జోలికి వెళ్లొద్దన్నారు. పందేలు నిర్వహించినట్లు తెలిస్తే జైలుకు పంపుతామన్నారు.

అంతిమ సంస్కారం

- అనాథలకు.. అభాగ్యులకు ఆత్మీయులై..
- 'మే ఐ హెల్ప్ యూ' సేవలు ఆదర్శప్రాయం
- మేమున్నామని ముందుకొచ్చి మరీ అంత్యక్రియలు



కరోనాతో మృతి చెందిన వ్యక్తిని అంత్యక్రియల కోసం తీసుకుపోతున్న మే ఐ హెల్ప్‌యూ సభ్యులు(ఫైల్)

యాడికి : ప్రతి మనిషి తన మరణానంతరం అంతిమ సంస్కారం గౌరవప్రదంగా జరగాలని కోరుకుంటారు. అయితే కరోనా మహమ్మారి అంతిమ సంస్కారాలు నిర్వహించలేని దుస్థితికి చేర్చింది. కనీసం చివరిచూపు చూడలేని పరిస్థితి కల్పించింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్న వారి పరిస్థితే ఇలాగుంటే ఇక అనాథల పరిస్థితి.. తలచుకుంటేనే భయం వేస్తుంది. ఇలాంటి తరుణంలో అటువంటి వారి అంతిమ సంస్కారాల బాధ్యతను కొందరు యువత తమ భుజస్కంధాలపై వేసుకుంది. సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే యాడికి చెందిన 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, ధృవనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, చింతామోహన్, చెన్నయ్య, ఆంజనేయులు, నాగరాజు, రామ్మోహన్, వేణు.

బాధితులకు ఊరట

కోవిడ్‌తోపాటు అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారికి అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు భయపడుతున్న వేళ 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ సభ్యులు మేమున్నామంటూ ముందుకు రావడం బాధిత కుటుంబాలకు ఊరటనిస్తోంది. మొదట్లో మండల పరిధిలో చనిపోయిన వారి దహన సంస్కారాల కోసం ఎవరూ ముందుకు రాకపోవటం మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యుడైన బండారు బాలకృష్ణను కలచివేసింది. వెంటనే సమాచారాన్ని తమ సంస్థ సభ్యులకు తెలియజేశారు. వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఇలా మండలంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఫౌండేషన్ సభ్యులు తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు లేకపోయినా, ఉన్నా సమయానికి అంత్యక్రియలకు చేరుకోలేని వారు 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ సెల్ నంబర్ 9912099782కు ఫోన్ చేస్తే.. సభ్యులు అక్కడికే వెళ్లి సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేస్తారు.

35 మందికి అంత్యక్రియలు...

యాడికి మండలంలో కరోనా సమయం నుంచి ఇప్పటి వరకూ రెండేళ్ల వ్యవధిలో 35 మందికి అంత్యక్రియలు నిర్వహించారు. కరోనాతోపాటు పలు రోగాలతో బెంగళూరు, హైదరాబాద్, అనంతపురం, కర్నూలు వంటి నగరాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వారి అంత్యక్రియలు నిర్వహించేందుకు భయపడి దగ్గరికి రాలేదు. అంతటా ఓదార్పు మాటలే తప్ప దహన సంస్కారాలు చేసేందుకు సాహసించని పరిస్థితి. ఈ క్రమంలో ఫౌండేషన్ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు.

పుణ్యకార్యంగా భావిస్తున్నా



రోడ్డు ప్రమాదాలు, పలు అనారోగ్యాలతో మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించడాన్ని పుణ్య కార్యంగా భావిస్తున్నా. ఎక్కడ అనాథ మృతదేహం ఉన్నా సమాచారం అందిస్తే అంతిమ సంస్కారాలు చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. కరోనా కాలంలో పలువురు తమ బంధువులకు అంత్యక్రియలు నిర్వహించాలని ఫోన్ ద్వారా సమాచారం అందించగా వెంటనే మేము స్పందించాం.

–చంద్రశేఖర్‌రెడ్డి, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యుడు

మానవత్వంతో చేస్తున్నాం



అనారోగ్యం, యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయిన అనాథలు. బంధువులు ఉన్నా అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు రావటం లేదు. దీంతో మేము మానవత్వంతో సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించాం. అంత్యక్రియల పూర్తయిన తర్వాత మృతుల కుటుంబ సభ్యులు మాకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

–బాలకృష్ణ, మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యుడు

ఆత్మీయుల్లా అంత్యక్రియలు



రెండు వారాల క్రితం కుమ్మెత నరసాపురం గ్రామానికి చెందిన వెంకటనారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు దిక్కుతోచని స్థితిలో ఉన్న మృతురాలి కుమారుడు యాడికి మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్‌ను సంప్రదించాడు. దీంతో సంస్థ సభ్యులు వచ్చి మా కులాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆత్మీయుల్లా అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయం.

–నాగరాజు, శింగనమల

వైఎస్సార్ జలకళ బోరు ప్రారంభం



బోరు తవ్వకం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి రూరల్: మామిళ్లచెరువు గ్రామంలో వైఎస్సార్ జలకళ కింద ఉచిత బోరు తవ్వకాన్ని ఆదివారం సర్పంచ్ గురుమస్తాన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుద్దల రాముయాదవ్, జిల్లా కార్యదర్శులు మామిళ్లచెరువు నాగిరెడ్డి, సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. పొలాల్లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ పెద్ద మొత్తం వెచ్చించి రైతులు బోర్లు వేయించుకోలేక ఇబ్బందులు పడేవారన్నారు. ఇది గమనించిన సీఎం వైఎస్ జగన్ మండలానికి ఒక బోర్‌వెల్ వాహనాన్ని పంపి రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయిస్తున్నారన్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలో 10 బోర్లు మంజూరయ్యాయన్నారు. నాయకులు సురేష్ యాదవ్, రామకృష్ణ, హరి పాల్గొన్నారు.

శింగవరం ప్రధాన రహదారి మరమ్మతు



శింగవరం వద్ద చిత్రావతి నదిపై మట్టిరోడ్డు ఏర్పాటు చేయడంతో తిరుగుతున్న వాహనాలు

యల్లనూరు: శింగవరం ప్రధాన రహదారిలో చిత్రావతి నదిపై ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ నాయకులు మట్టి రోడ్డును ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. నెల రోజుల కిందట పార్నపల్లి రిజర్వాయర్ నుంచి పెద్ద ఎత్తున చిత్రావతి నదికి నీరు ఉధృతంగా ప్రవహించడంతో శింగవరం గ్రామ సమీపంలోని చిత్రావతి నదిలో వేసిన రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు రోడ్డు దాటేందుకు వీలు లేక ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, గడ్డంవారిపల్లి రామాంజులరెడ్డి సొంత డబ్బు రూ.2 లక్షలతో కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఇప్పుడు తిమ్మంపల్లి నుంచి శింగవరం మీదుగా పులివెందులకు వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసిన ప్రభుత్వ విద్య సలహాదారు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రజలు ధన్యవాదాలను తెలియజేస్తున్నారు.

వాడవాడలా సంక్రాంతి ముగ్గుల పోటీలు



23వ వార్డులో ముగ్గులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో 23, 10,2,30,34,4 వార్డుల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ముగ్గులను పరిశీలించారు. సంక్రాంతి పండుగ విశిష్ఠత, ప్రభుత్వ పథకాలు, సందేశాత్మక ముగ్గులు వేసిన మహిళలను విజేతలుగా ఎంపిక చేశారు. కౌన్సిలర్లు విజయలక్ష్మి, మెహరున్నీసా, చాముండేశ్వరి, సుమోబాష, సుజాత, మాజీ చైర్మన్ రామాంజినేయులు, మైనార్టీ నాయకుడు జమీల్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, సీఓలు మధు, మనోప్రియ, సుశీల, వనజాక్షి, అంజనా, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామీ.. నమోస్తుతే

పెద్దపప్పూరు: అశ్వత్థ క్షేత్రంలో ఆదివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఏఎస్ఐ మహదేవ్ భోజనం ఏర్పాటు చేశారు. అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సుధీర్ కుమార్ శర్మ, సునీల్ కుమార్ శర్మ భక్తులకు స్థల పురాణాన్ని వివరించారు.

అనారోగ్యంతో ఆదర్శరైతు మృతి



తిరుపాల్‌రెడ్డి(ఫైల్)

యాడికి: కత్తిమానుపల్లెకు చెందిన ఆదర్శ రైతు రెండెద్దుల తిరుపాల్‌రెడ్డి(52) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రెండెద్దుల తిరుపాల్‌రెడ్డి తనకున్న 13 ఎకరాల పొలంలో వేరుశనగ, ఉల్లి సాగు చేసేవాడు. ఇందులో అధిక దిగుబడులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తర్వాత కాలంలో వ్యవసాయం కలిసి రాక పంటలు సాగు చేయడం మానేశాడు. ఈక్రమంలో తాడిపత్రిలో ఏడాది నుంచి చిరు వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల కాలికి దెబ్బ తగిలి సెప్టిక్ కావడంతో కర్నూలు ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మెకానిక్‌ల ర్యాలీ



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న మెకానిక్‌లు

గుత్తి: పట్టణంలోని ఆదివారం నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్‌లు భారీ ర్యాలీ నిర్వహించారు. నవాంధ్ర మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జాఫర్ నేతృత్వంలో మెకానిక్‌లు అనంతపురం రోడ్డులోని హీరో షోరూమ్ వద్ద నుంచి జయలక్ష్మి పెట్రోల్ బంక్, కేపీఎస్ సినిమా థియేటర్ ఆర్టీసీ బస్టాండ్, గాంధీ సర్కిల్ మీదుగా నిజామి షాదీ ఖానా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిజామి షాదీ ఖానాలో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మెకానిక్‌లు సమాజానికి ఎంతో ఉపయుక్తమైన వారన్నారు. ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

సెక్యూరిటీ గార్డుకు గాయాలు

గార్లదిన్నె: స్థానిక శింగనమల క్రాస్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డుకు గాయాలైన సంఘటన చోటు చేసుకుంది.108 సిబ్బంది వివరాల మేరకు.. గుంతకల్లు మండలం గొల్లల దొడ్డికి చెందిన సాయినాథ్ గౌడ్ అనే వ్యక్తి గుంతకల్లు ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. బైక్‌పై వడియంపేటకు వెళ్లి అక్కడ పని ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరాడు. శింగనమల క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులు గాయపడిన అతడిని 108లో అనంతపురం తరలించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

తాడిపత్రి: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ పొందవచ్చని ఎంఈఓ నాగరాజు, గ్రాండ్ మాస్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. జీవీపీ కాలనీలోని జపాన్ చుటోరియా శిక్షణ కేంద్రం(మార్షల్ ఆర్ట్స్)లోని విద్యార్థులకు ఆదివారం వారు మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జపాన్ చుటోరియా శిక్షణ కేంద్రం తాడిపత్రి కరాటే బ్రాంచ్ మాస్టర్ శ్రీనివాసులు రెడ్డి, హసీనా, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్న ఆటో స్టాండ్‌లో ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు విజయభాస్కర్, గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, స్వాతంత్య్ర సమరయోధుడు సూర్యనారాయణ రెడ్డి, కోట గైడ్ రమేష్ మాట్లాడుతూ పదేళ్లుగా గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్నామన్నారు. క్యాలెండర్‌లో గుత్తి కోట ప్రాముఖ్యత, గుత్తి పరిసరాల్లో ఉన్న పవిత్ర స్థలాలు, ఆలయాల సమాచారం పొందు పరిచామని తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు క్యాలెండర్లు అందజేశారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన చంద్రమౌళి, యాడికి గ్రామానికి చెందిన నీలకంఠ బైక్‌పై యల్లనూరు మండలం లక్ష్మంపల్లి నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. సూరేపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరయ్యే స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసే ప్రజలు ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను తప్పకుండా వేయాలని సూచించారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని తహసీల్దారు రమాదేవి పేర్కొన్నారు. ప్రజల అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కారం చూపాలని సూచించారు.

కురుబ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ సునీత, ఉద్యోగులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఉజ్జినప్ప ఆలయంలో ఆదివారం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ సునీత క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు రామకృష్ణ, బండి సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మారుతి, లింగమయ్య, వెంకటేష, రేణుక, శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



హాజీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, నాయకులు

గుంతకల్లుటౌన్: టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఎం.హాజీ మలాంగ్ బాబాను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆదివారం హౌసింగ్‌బోర్డులోని హాజీ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే అతని ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, దాడికి పాల్పడిన టీడీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు యువనేత మంజునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



ఇరుముడి కడుతున్న గురుస్వాములు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు 65 మందికి ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది. పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఇరుముడి ధరించిన మాలధారులు శబరిమలకు బయలుదేరారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అమ్మవారి ఆలయాల్లో అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ తల్లి, కాశీ విశ్వేశ్వరాలయంలో కాశీ విశాలాక్షి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేయించారు.



నార్పలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



గుంతకల్లు టౌన్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

నార్పల: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. దాదాపు 26 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అప్పటి ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరుకావడంతో వారిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఒకరికొకరు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988–1993(6 నుంచి 10వ తరగతి) బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన పూర్వ విద్యార్థి రాఘవేంద్ర కుటుంబానికి రూ.55 వేల చెక్కును అందజేశారు.